# కార్యకర్తలకు న్యాయం చేయాలి

మహమ్మద్ లతీఫ్



**నేటి సాక్షి,గజ్వేల్ :** పార్టీ కోసం నిరంతరం శ్రమించిన కార్యకర్తలకు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత కల్పించి న్యాయం చేయాలని తెలంగాణ ఉద్యమకారుడు మహమ్మద్ లతీఫ్ డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుండి దాని బలోపేతం కోసం తాను చేసిన కృషిని వివరించారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పాలకవర్గంలో కో-ఆప్షన్ సభ్యుడిగా తనకు అవకాశం కల్పించాలని ఆయన పార్టీ నాయకత్వాన్ని కోరారు. గత రెండు మున్సిపల్ ఎన్నికల్లో తాను పోటీకి సిద్ధంగా ఉన్నప్పటికీ, పార్టీ ప్రయోజనాల దృష్ట్యా వెనక్కి తగ్గానని ఆయన గుర్తు చేశారు. అప్పట్లో నాయకులు ఇచ్చిన హామీ మేరకు ఈసారి జరగనున్న కో-ఆప్షన్ సభ్యుల ఎన్నికల్లో తనకు తప్పనిసరిగా అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. నిబద్ధతతో పనిచేసే కార్యకర్తలను గుర్తించినప్పుడే పార్టీకి మరింత బలం చేకూరుతుందని లతీఫ్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆయనతో పాటు పలువురు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# కుక్కల దాడి ఆవు మృతి



**నేటి సాక్షి,మాదాపూర్ :** మండలంలోని మాదాపూర్ గ్రామంలో కుక్కల దాడులు ఆందోళన కలిగిస్తున్నాయి ఒక ఘటన మరువకముందే మరో ఘటన చూస్తే చోటు చేసుకోవడం గ్రామస్తులు భయభ్రాంతులకు గురవుతున్నారు గ్రామానికి చెందిన బైరి బుచ్చిరెడ్డి చెందిన సుమారు 60 వేల పిలువగల పాడి ఆవును కుక్కలు దాడి చేసి చంపిన ఘటన చోటుచేసుకుంది కుక్కలు ఆవును కొరికి తినడంతో రైతు తీవ్రంగా నష్టపోయినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు స్థానికులు వివరాల ప్రకారం సమీప ప్రాంతాలలో కోళ్ల వ్యర్థాలను నిర్లక్ష్యంగా పడి వేయడం వల్ల కుక్కలు గుంపులు గుంపులుగా చేరుతున్నాయని అన్నారు ఈ కుక్కలు పశువుల పాకాల్లోకి చేరి వందల సంఖ్యలు తిరుగుతూ పశువుల పై దాడులు చేస్తున్నాయని గ్రామస్తులు తెలిపారు ఈ సమస్యపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి కుక్కల నియంత్రణ చర్యలు చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు

# ప్రతిభ చాటిన విద్యార్థులు



**నేటి సాక్షి నారాయణపేట,(ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లా మరికల్ మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన విద్యార్థులు విద్య మరియు క్రీడారంగాల్లో అద్భుత ప్రతిభ కనబరిచి గ్రామానికి గర్వకారణంగా నిలిచారు. ఈ సందర్భంగా సోమవారం గ్రామ సర్పంచ్ విజయకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులను గ్రామస్థుల సమక్షంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఇంటర్ ప్రథమ సంవత్సర ఫలితాల్లో పెబ్బేటి రాఘవేందర్ రెడ్డి - అరుణల కుమార్తె వర్షిత 470 మార్కులకు గాను 464 మార్కులు సాధించి మహబూబ్‌నగర్ అక్షర కాలేజీ టాపర్‌గా నిలిచింది. అదేవిధంగా క్రీడారంగంలో ప్రతిభ చాటిన విద్యార్థులను కూడా సర్పంచ్ సత్కరించారు. హనుమకొండలో అట్లాంటిక్ అసోసియేషన్ నిర్వహించిన రన్నింగ్ రేసులో 5 కిలోమీటర్ల విభాగంలో రాష్ట్రస్థాయిలో మూడవ ర్యాంకు సాధించిన కౌకుంట్ల శివకుమార్, 3 కిలోమీటర్ల విభాగంలో ఐదవ ర్యాంకు సాధించిన గానాటి కార్తీక్‌లకు మెడల్స్ అందజేసి అభినందించారు. గ్రామానికి పేరు తెచ్చిన విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సర్పంచ్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, కార్యకర్తలు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# సహారా కార్యాలయం ముందు బాధితుల ఆందోళన



**నేటి సాక్షిమందమర్రి :** మంచిర్యాల జిల్లా మందమర్రి మార్కెట్ ప్రాంతంలోని సహారా ఇండియా కార్యాలయం ముందు సోమవారం బాధితులు ధర్నా నిర్వహించారు. సహారా సంస్థలో తాము చేసిన ఫిక్స్‌డ్ డిపాజిట్ల కాలపరిమితి ముగిసి ఐదేళ్లు గడుస్తున్నా, యాజమాన్యం డబ్బులు చెల్లించడం లేదని ఆరోపిస్తూ బాధితులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. తమ కష్టార్జితాన్ని వెంటనే చెల్లించాలని, లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. లక్షలాది మంది బాధితులు ఎదుర్కొంటున్న ఈ సమస్యపై రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావు, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ స్పందించి తమకు న్యాయం చేయాలని బాధితులు విజ్ఞప్తి చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సహారా ఇండియా మేనేజర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకుడు గజెల్లి వెంకటయ్య, బాధితులు సంజీవ్, రాజమౌళి, రామ్ నరేష్ బాబు, సంపత్, మల్లేశ్వరి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# అందరి కృషితోనే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యం



- ట్రాఫిక్ నియమాలు పాటిద్దాం.. ప్రాణాలను కాపాడుకుందాం: జిల్లా ఎస్పీ అశోక్ కుమార్
- జిల్లావ్యాప్తంగా ఘనంగా ప్రారంభమైన 'అరైవ్-అలైవ్' అవగాహన వారోత్సవాలు
- అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడంపై పోలీసుల హెచ్చరిక



**నేటి సాక్షి,జగిత్యాల(రాధారపు నర్సయ్య):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రోడ్డు ప్రమాదాల నియంత్రణే లక్ష్యంగా 'అరైవ్-అలైవ్' కార్యక్రమాన్ని సోమవారం జిల్లావ్యాప్తంగా ప్రారంభించారు. జగిత్యాల పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొని జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రోడ్డు భద్రత అనేది ఒక్క పోలీస్ శాఖ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని స్పష్టం చేశారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ బాధ్యతాయుతంగా ప్రయాణించినప్పుడే ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందన్నారు. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో ఇతర కారణాల కంటే రోడ్డు ప్రమాదాల వల్లనే ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోవడం ఆందోళనకరమని అన్నారు. ఏప్రిల్ 13 నుండి 18 వరకు నిర్వహించే ఈ ప్రత్యేక వారోత్సవాల ద్వారా ప్రజల్లో డిఫెన్సివ్ డ్రైవింగ్ పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం, డ్రైవింగ్ చేస్తూ సెల్ ఫోన్ వాడటం వంటి అలవాట్లను పూర్తిగా నియంత్రించాలని హెచ్చరించారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్, డీఎస్పీ రఘు చందర్, ఆర్టీఓ శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, పోలీస్ అధికారులు కరుణాకర్, ఎస్.ఐలు, మున్సిపల్ కౌన్సిలర్లు, సుమారు 300 మంది విద్యార్థులు మరియు ప్రజలు పాల్గొన్నారు.

# ఆరు గ్యారంటీలు కాదు.. ఆరు మోసాల పథకాలు

- ప్రజలకు బాండ్ పేపర్లు రాసి నమ్మించారు: మాదాసు
- అభయహస్తం మేనిఫెస్టో దేశ చరిత్రలోనే అతిపెద్ద మోసం: మాదాసు శ్రీనివాస్




**నేటి సాక్షి గజ్వేల్ :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించి ప్రజలను మోసం చేసిందని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ మండిపడ్డారు. ఎన్నికల ముందు ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి, ఇప్పుడు ప్రజల జీవితాలతో చెలగాటమాడుతోందని విమర్శించారు. కాంగ్రెస్ అసమర్థ పాలనతో తెలంగాణలో ఆర్థిక వ్యవస్థ పతనం అయిందని ఆరోపించారు. గజ్వేల్ మండలం అహ్మదీపూర్ గ్రామానికి చెందిన ఆందోలు గణేష్ అనారోగ్యంతో నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో, మాజీ సీఎం కేసీఆర్, ఎమ్మెల్సీ యాదవ రెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.2 లక్షల గూజ చెక్కును మాదాసు శ్రీనివాస్ ఈరోజు బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్య భద్రత కోసం సీఎం రిలీఫ్ ఫండ్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వంతో పోలిస్తే ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం చాలా తక్కువ నిధులను మంజూరు చేస్తోందని, పేద ప్రజల వైద్య అవసరాలను దృష్టిలో పెట్టుకుని సహాయాన్ని మరింత పెంచాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో 'అభయహస్తం' మేనిఫెస్టో పేరుతో ప్రజలకు బాండ్ పేపర్లు రాసిచ్చి 100 రోజుల్లో హామీలు అమలు చేస్తామని చెప్పి ఓట్లు దండుకున్న కాంగ్రెస్, అధికారంలోకి వచ్చాక హామీల జాడే లేకుండా చేసిందని విమర్శించారు. బడ్జెట్‌లో కూడా ఇచ్చిన గ్యారంటీల అమలుకు సరైన నిధులు కేటాయించలేదని, మాటల గారడీ తప్ప పేదల పట్ల చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు. 840 రోజులు గడిచినా మహిళలకు రూ.2,500 మహాలక్ష్మి పథకం అమలు కాలేదని ప్రశ్నించారు. నిరుద్యోగులకు హామీ ఇచ్చిన 2 లక్షల ఉద్యోగాలు ఎక్కడ? నిరుద్యోగ భృతి ఏమైంది? అంటూ నిలదీశారు. ఆటో డ్రైవర్లకు ఇస్తామని చెప్పిన రూ.24,000 సహాయం ఇప్పటికీ అందలేదని, రెండు సంవత్సరాలుగా బాకీలు ఉన్నాయని విమర్శించారు. వృద్ధులకు నెలకు రూ.4,000 చొప్పున ఇవ్వాల్సిన మొత్తంలో బాకీలు ఎక్కడ? అంటూ ప్రశ్నించారు. పేదింటి ఆడబిడ్డలకు తులం బంగారం ఇస్తామని చెప్పిన హామీ ఏమైందని నిలదీశారు. అలాగే దివ్యాంగులకు రూ.6,000 పెన్షన్ హామీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు రైతు భరోసా పేరుతో రూ.15,000 ఇస్తామని చెప్పి, ఇప్పటికే ఉన్న రైతుబంధు అమలులో కూడా విఫలమయ్యారని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో ప్రజల సంక్షేమ పథకాలు నిలిచిపోయాయని, రాష్ట్ర ప్రజలను గాలికి వదిలేసిందని అన్నారు. కేసీఆర్ నాయకత్వంలో మళ్లీ రామరాజ్యం రాబోతోందని, కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బ్యాగారి ప్రభాకర్, ఉపసర్పంచ్ గోపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ చాడ శ్రీనివాస్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్, మాజీ కో-అప్షన్ సభ్యుడు అహ్మద్, గ్రామ పార్టీ అధ్యక్షుడు నిజామొద్దీన్, రాములు గౌడ్, కిష్టారెడ్డి, నరేష్, రాజు, సంపత్, మహిపాల్ రెడ్డి, అమర్, సింహం, కనకయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# వెంకటాపూర్‌లో 'ఆరైవ్-అలైవ్' గ్రామ సభలు





**నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య):** 'అరైవ్-అలైవ్' కార్యక్రమంలో భాగంగా కోరుట్ల పట్టణం మరియు వెంకటాపూర్ గ్రామంలో పాలకవర్గం, ఎంపీడీవో, రెవెన్యూ, ఆర్అండ్‌బీ, ఎంవీఐ, పోలీస్ మరియు గ్రామ పంచాయతీ అధికారుల సమన్వయంతో గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాల ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించారు.

- అధికారుల సమన్వయం - ప్రజల భాగస్వామ్యంతో కార్యక్రమాలు

కార్యక్రమంలో భాగంగా రహదారులపై గుంతలను పూడ్చి ప్యాచ్ వర్క్ చేపట్టడంతో పాటు గ్రామ రహదారుల పక్కన ఉన్న చెట్ల పొదలను తొలగించారు. గ్రామస్తుల సహకారంతో నిర్వహించిన ఈ చర్యలు రోడ్డు ప్రమాదాలను తగ్గించడంలో కీలకంగా మారనున్నాయని కోరుట్ల ఎస్సై చిరంజీవి తెలిపారు. ట్రాఫిక్ నియమాలను పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, సురక్షిత ప్రయాణం కోసం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో రోడ్డు భద్రతపై అవగాహన మరింత పెరిగిందని అధికారులు పేర్కొన్నారు.

# అంబారిపేటలో రోడ్డు భద్రతపై పోలీసుల అవగాహన




**నేటి సాక్షి,ఎండపల్లి :** ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా మండలంలోని అంబారిపేట గ్రామంలో సోమవారం 'అరైవ్–అలైవ్' రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాన్ని పోలీసులు నిర్వహించారు. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు ధర్మపురి సీఐ రామ్ నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వెల్గటూర్ ఎస్సై పి. ఉదయ్ కుమార్ పాల్గొని మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి వాహనదారుడు హెల్మెట్ ధరించాలని, అతివేగం మరియు మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రాణాంతకమని ఆయన హెచ్చరించారు. ముఖ్యంగా మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని తల్లిదండ్రులకు సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో రోడ్డు భద్రతా కమిటీని ఏర్పాటు చేసి, అందరితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం గ్రామ శివారులో రహదారికి ఇబ్బందిగా ఉన్న చెట్ల పొదలను పంచాయతీ సిబ్బందితో కలిసి తొలగించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దర్శనాల నరేష్, గిర్ధవర్ అన్వేష్, కార్యదర్శి విజయ్ కుమార్, ఉప సర్పంచ్ శ్రీకాంత్ మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రజలకు పారదర్శక సేవలే నా లక్ష్యం

**తహశీల్దారు వలీబాషా**



**నేటి సాక్షి:** పెద్దకడబూరు మండల తహశీల్దారుగా వలీబాషా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం వలీబాషా మాట్లాడుతూ, ప్రజలకు పారదర్శకంగా, సమర్ధవంతంగా సేవలు అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యంగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని స్పష్టం చేశారు. గతంలో ఇదే ప్రాంతంలో ఆర్ఐగా పనిచేసిన అనుభవం తనకు ఉందని పేర్కొంటూ, స్థానిక సమస్యలపై అవగాహనతో సేవలు అందిస్తానన్నారు. అనంతరం వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి స్వయంగా అర్జీలు స్వీకరించి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని తెలిపారు.

# తాగునీరు లేక అల్లాడుతున్న ప్రజలు



**నేటి సాక్షి :** పెద్దకడబూరు మండలంలోని బైపాస్ నుంచి కురువగేరి వరకు ప్రాంతాల్లో గత 12 రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేసవి తీవ్రత పెరిగిన నేపథ్యంలో నీటి కొరత మరింత పెరిగి కాలనీవాసులు రోజువారీ అవసరాలకు కూడా నీరు దొరకక ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై సోమవారం కాలనీవాసులు తహశీల్దార్ వలీభాషాను కలిసి వినతిపత్రం సమర్పించారు. పంచాయతీ మరియు ఆర్డబ్ల్యూఎస్ అధికారుల నిర్లక్ష్యంపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వేసవిలో తాగునీటి అవసరం అత్యవసరమైనప్పటికీ అధికారులు కుంటిసాకులు చెబుతూ సమస్యను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తక్షణమే స్పందించి తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని, భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేశారు.

# అగ్నిమాపక వారోత్సవాలు

**గోడ పత్రికల విడుదల..**



**నేటి సాక్షి,కోదాడ:** అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా కోదాడ డీఎస్పీ కార్యాలయంలో గోడ కరపత్రాలను విడుదల చేసి అగ్గిమాపక ఇబ్బందికి ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కోదాడ డీఎస్పీ శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు అప్రమత్తంగా వ్యవహరించడం ఎంతో అవసరమని తెలిపారు. చిన్న నిర్లక్ష్యమే పెద్ద ప్రమాదాలకు దారితీస్తుందని, ప్రతి ఒక్కరూ అగ్నిమాపక భద్రతా నియమాలను పాటించాలని సూచించారు. మునగాల సిఐ రామకృష్ణ రెడ్డి మాట్లాడుతూ. గృహాల్లో, వ్యాపార సంస్థల్లో ఫైర్ సేఫ్టీ పరికరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. స్టేషన్ ఫైర్ ఆఫీసర్ కే డాక్టర్ బాబు అగ్నిప్రమాదాలను ఎలా నివారించాలి, జరిగినప్పుడు ఎలా స్పందించాలి అనే అంశాలపై వివరంగా తెలియజేశారు. లీడింగ్ ఫైర్ ఫైటర్ ఆర్ నాగయ్య మరియు సిబ్బంది వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలు పాటించి.. సురక్షితంగా గమ్యం చేరాలి





- జిల్లావ్యాప్తంగా ఉధృతంగా సాగుతున్న 'అరైవ్-అలైవ్' కార్యక్రమం
- డ్రైవర్లకు కంటి పరీక్షలు.. అద్దాల పంపిణీ చేసిన ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావు
- పాఠశాలలు, పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**నేటి సాక్షి,మంచిర్యాల :** వాహనదారులు రహదారి భద్రతా నిబంధనలను తూచా తప్పకుండా పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సోమవారం హాజీపూర్ మండలం రాపల్లి గ్రామంలో నిర్వహించిన 'అరైవ్-అలైవ్' అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం వంటివి ప్రాణాంతకమని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించి రోడ్లపై కేజ్ వీల్స్ నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని, డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరికితే లైసెన్స్‌లు సస్పెండ్ చేస్తామని స్పష్టం చేశారు. మైనర్లకు వాహనాలు ఇస్తే వారి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామన్నారు. హెల్మెట్ ధరించడం ప్రాణరక్ష: ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావు మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్ రావు మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. మనం పాటించే చిన్న చిన్న జాగ్రత్తలే ప్రాణాలను కాపాడతాయని తెలిపారు. అనంతరం ఆటో, లారీ డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేశారు. అనంతరం కలెక్టర్ పడ్తనపల్లి ప్రాథమిక పాఠశాల, హాజీపూర్ కేజీబీవీ విద్యాలయాలను సందర్శించారు. అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించి, విద్యార్థులకు పౌష్టికాహార మెనూ అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. సబ్బపల్లిలోని పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని సందర్శించి, విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ భాస్కర్, ఏసీపీ ప్రకాష్, తహసీల్దార్ పుష్పలత, రవాణా శాఖ అధికారులు మరియు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# మంత్రి సీతక్కపై తప్పుడు ఆరోపణలు మానుకోవాలి



- ఆధారాలు ఉంటే కోర్టుకు వెళ్ళు.. సోషల్ మీడియాలో దొంగ మాటలు ఎందుకు?
- క్రిశాంక్ వైఖరిపై కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి ఆగ్రహం

**నేటి సాక్షి,మంగపేట :** మంత్రి సీతక్కపై సామాజిక మాధ్యమాల్లో నిరాధారమైన ఆరోపణలు చేస్తున్న బీఆర్ఎస్ నేతలకు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి అయ్యోరి యాణయ్య తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. సోమవారం మంగపేట మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు మైల జయరాం రెడ్డి అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యాణయ్య మాట్లాడుతూ.. అణగారిన వర్గాల నుండి ఎదిగి, నిరంతరం ప్రజాసేవలో ఉన్న మంత్రి సీతక్కపై బీఆర్ఎస్ నాయకుడు క్రిశాంక్ కావాలనే అత్యుత్సాహంతో అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. గత మార్చి 17న ఒకసారి 8 కోట్లు, ఇప్పుడు 30 కోట్ల అవినీతి అంటూ పరస్పర విరుద్ధమైన మాటలు మాట్లాడుతున్న క్రిశాంక్‌కు దమ్ముంటే కోర్టుకు వెళ్లి న్యాయపరంగా తేల్చుకోవాలని సవాల్ విసిరారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలను కాంగ్రెస్ ప్రభుత్వం బయటపెడుతుందనే భయంతోనే, తమ నాయకుల మెప్పు కోసం మంత్రి సీతక్క కీర్తిని దెబ్బతీయాలని చూస్తున్నారని విమర్శించారు. కేవలం సోషల్ మీడియాలో నిందలు వేస్తూ కాలక్షేపం చేయడం మానుకోవాలని, లేనిపక్షంలో కార్యకర్తలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు, సాంబశివరావు, సురేంద్రబాబు, సమ్మయ్య, భగవాన్ రెడ్డి, మల్లయ్య, నరేష్ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇంటర్ ఫలితాల్లో "శ్రీ అరోరా కళాశాల" జయకేతనం









- ఎంపీసీ ప్రథమ సంవత్సరంలో భవానికి 463 మార్కులు
- విద్యార్థుల ప్రతిభపై ప్రిన్సిపాల్, యాజమాన్యం హర్షం

**నేటి సాక్షి,మిర్యాలగూడ:** ఆదివారం విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో పట్టణంలోని "శ్రీ అరోరా జూనియర్ కళాశాల" విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు ప్రిన్సిపాల్ పోరెడ్డి దుర్గారెడ్డి తెలిపారు. ప్రథమ సంవత్సర ఎంపీసీ విభాగంలో పి. భవాని 463 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో మెరిసిందని పేర్కొన్నారు. అలాగే బైపీసీలో కె. శ్రావ్య (396), సీఈసీలో శివసాయి (427) మార్కులు సాధించి కళాశాల పేరు నిలబెట్టారని తెలిపారు. ద్వితీయ సంవత్సర ఫలితాల్లోనూ విద్యార్థులు సత్తా చాటారు. ఎంపీసీ విభాగంలో ఎస్.కె. జహ్రాతబుస్సుమ్ 960 మార్కులు, బైపీసీలో ఆఫ్రీన్ బేగం 904 మార్కులు, సీఈసీలో నక్షత్ర 935 మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ వివరించారు. ఈ ఫలితాల్లో ప్రథమ సంవత్సరం నుండి 22 మంది విద్యార్థులు 400లకు పైగా, ద్వితీయ సంవత్సరం నుండి 25 మంది 900లకు పైగా మార్కులు సాధించడంపై యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు పోలగాని మట్టయ్య, కొండారి వెంకటేశ్వర్లు, నాయిని రాజశేఖర్, మల్లికంటి పరమేష్, మానె నర్సింహ మరియు అధ్యాపక బృందం పాల్గొని విద్యార్థులను అభినందించారు.

# జనాభా గణనపై ఈనెల 15 నుండి శిక్షణా తరగతులు



**నేటి సాక్షి, పాములపాడు:** పాములపాడు మండలంలో జనాభా గణన–2027పై జిల్లా పరిషత్ హై స్కూల్లో, సూపర్వైజర్లకు, ఎన్యుమరేటర్లకు ఈనెల 15 నుండి 17 వరకు మొదటి బ్యాచ్, 21 నుండి 23 వరకు రెండవ బ్యాచ్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తహసిల్దార్ జి.సుభద్రమ్మ తెలియజేశారు. పాములపాడు మండలానికి సంబంధించి జనాభా గణాన–2027 సర్వేకు చార్జ్ ఆఫీసర్‌గా తహాసిల్దార్– జి.సుభద్రమ్మ, అడిషనల్ చార్జ ఆఫీసర్‌గా ఎంపీడీవో– ఎన్.చంద్రశేఖర్, అసిస్టెంట్ ఛార్జ ఆఫీసర్‌గా డిప్యూటీ తహాసిల్దార్– డి.పఠాన్ బాబు, టెక్నికల్ అసిస్టెంట్‌గా ఏఎస్ ఓ–తేజశ్రీ ని జిల్లా కలెక్టర్ నియమించడం జరిగింది. ఈ సందర్భంగా తహసిల్దార్ జి.సుభద్రమ్మ మాట్లాడుతూ పాములపాడు మండలంలో జనాభా గణన సర్వే చేయడానికి సూపర్వైజర్లకు, ఎన్యూమరేటర్లకు మూడు రోజులపాటు స్వీయ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలియజేశారు. ఈ శిక్షణ పాములపాడు జడ్పీ హైస్కూల్లో ఉదయం 9:30 నుండి సాయంత్రం 5:30 గంటల వరకు ఉంటుందన్నారు. సూపర్వైజర్లుగా మండల అధికారులు & సీనియర్ పంచాయతీ సిబ్బంది–14 మందిని తీసుకున్నట్టుగా, ఎన్యూమరేటర్లుగా సచివాలయ సిబ్బందిని–74 మందిని, ఫీల్డ్ ట్రైనర్లుగా ఇద్దరు టీచర్లను తీసుకున్నట్టుగా తెలియజేశారు. మొదటి బ్యాచ్ శిక్షణకు–45 మందిని, రెండవ బ్యాచ్ శిక్షలకు– 43 మందిని తీసుకున్నట్టు తెలియజేశారు. భారతదేశ జనాభా గణాన–2027 (ఫేస్–1) లో భాగంగా క్షేత్రస్థాయిలో నాణ్యమైన డేటా సేకరణే లక్ష్యంగా ఈ సిబ్బంది పనిచేస్తారన్నారు.

# హెల్మెట్ ధరించండి.. ప్రాణాలను రక్షించుకోండి



- సర్పంచ్ వేమూరి సత్యనారాయణ
- నరసింహపురంలో రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు
- నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్యం చేరాలని పిలుపు

**నేటి సాక్షి,మునగాల :** ప్రస్తుత కాలంలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని నరసింహపురం సర్పంచ్ డాక్టర్ వేమూరి సత్యనారాయణ పిలుపునిచ్చారు. ప్రజాపాలన ప్రగతి నివేదికలో భాగంగా మండల పరిధిలోని నరసింహపురం గ్రామపంచాయతీ ఆవరణలో సోమవారం రోడ్డు భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువతలో పెరుగుతున్న నిర్లక్ష్య ధోరణి వల్ల అనేక కుటుంబాల్లో విషాదం నిండుతోందని, వేగంగా వాహనాలు నడపడం మానుకోవాలని హితవు పలికారు. హెల్మెట్ ధరించడం అనేది కేవలం నిబంధన మాత్రమే కాదని, అది ప్రాణ రక్షక కవచమని ఆయన గుర్తుచేశారు. ప్రమాదాలు జరిగినప్పుడు తలకు గాయాలు కాకుండా హెల్మెట్ కాపాడుతుందని, అలాగే నాలుగు చక్రాల వాహనదారులు సీటు బెల్ట్ ధరించడం వల్ల ప్రాణాపాయం నుండి తప్పించుకోవచ్చని వివరించారు. డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వాడటం, మద్యం సేవించి వాహనం నడపడం వంటివి ప్రాణాంతకమని హెచ్చరించారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రయాణాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని రోడ్డు భద్రత నిబంధనలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

# వల్లూరులో సమగ్ర నీటి భద్రత కార్యక్రమం నిర్వహణ





**నేటి సాక్షి :** కౌతాళం మండలం వల్లూరు గ్రామంలో సోమవారం "సమగ్ర నీటి భద్రత – సాగు నీటి సంఘాల బాధ్యత" కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రాలయం టీడీపీ ఇంచార్జ్ ఎన్. రాఘవేంద్ర రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా గ్రామ చెరువుకు జలహారతి ఇచ్చి, నీటి సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం నీటి వనరుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఏప్రిల్ 6 నుంచి జూలై 14 వరకు 100 రోజులపాటు నిర్వహించే ఈ కార్యక్రమం ద్వారా భూగర్భ జల మట్టాలను పెంచడం, చెరువులు, కాలువలు, చెక్ డ్యాముల పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. గ్రామ స్థాయిలో సాగు నీటి సంఘాలు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తేనే నీటి వినియోగం సక్రమంగా జరుగుతుందని, రైతులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక ప్రజలు, రైతులు, అధికారులు పాల్గొన్నారు.

# పెద్దకడబూరులో జనాభా గణన శిక్షణా తరగతులు ప్రారంభం



**నేటి సాక్షి,పెద్దకడబూరు :** పెద్దకడబూరు మండలంలో 2027 జనాభా గణనకు సంబంధించిన ముందస్తు ఏర్పాట్లు వేగవంతమయ్యాయి. ఇందులో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల సచివాలయాల సిబ్బందికి ఇండ్ల జాబితా తయారీపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. ఏప్రిల్ 13 నుంచి 22 వరకు కొనసాగే ఈ శిక్షణలో మండల ఫీల్డ్ ట్రైనర్లు జనగణన విధి విధానాలను సిబ్బందికి వివరించారు. ఈ సందర్భంగా మండల సెన్సెస్ ఆఫీసర్ (తహసిల్దార్) మాట్లాడుతూ.. దేశ సామాజిక, ఆర్థిక విధానాల రూపకల్పనలో జనాభా గణన కీలక పాత్ర పోషిస్తుందని, ఖచ్చితమైన గణాంకాలతోనే సంక్షేమ పథకాలు అర్హులకు అందుతాయని తెలిపారు. అడిషనల్ చార్జ్ ఆఫీసర్ (ఎంపీడీవో) ప్రభావతి దేవి మాట్లాడుతూ.. సిబ్బంది బాధ్యతతో పనిచేసి జనగణన ప్రక్రియను విజయవంతం చేయాలని సూచించారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మే 1 నుంచి 30 వరకు మొదటి విడతగా ఇండ్ల జాబితా తయారీ చేపట్టనున్నట్లు, వచ్చే ఏడాది రెండో విడత గణన ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, ఏఎస్ఓలు, సెన్సెస్ డీలింగ్ ఆఫీసర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# జగిత్యాల సభను జయప్రదం చేయాలి



## రాజారాంపల్లిలో బీఆర్ఎస్ సన్నాహక సమావేశం

**నేటి సాక్షి, ఎండపల్లి:** మండలంలోని రాజారాంపల్లి గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ సన్నాహక సమావేశం నిర్వహించారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆదేశాల మేరకు సోమవారం జరిగిన సమావేశంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ మండలం శాఖ అధ్యక్షులు సింహాచలం జగన్ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 20వ తేదీన సాయంత్రం 5 గంటలకు జగిత్యాలలో జరిగే సభకు పెద్ద ఎత్తున హాజరై సభను జయప్రదం చేయాలని కోరారు. మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి పార్టీలో చేరుతున్న శుభ సందర్భంగా ఈ సభకు ప్రత్యేక ప్రాధాన్యం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గాజుల మల్లేశం, సర్పంచ్ గాదం భాస్కర్, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ పడిదం నారాయణ, ఉప సర్పంచ్ మెరుగు జానీ, మాజీ సర్పంచ్ గంధం లక్ష్మీనారాయణ, ఉద్యమకారుడు పడిదం వెంకటేష్, గ్రామ శాఖల అధ్యక్షులు తనుగుల జగతి, ఉప్పు రాజయ్య, కొమ్ము సంజీవ్, గంధం తిరుపతి, చెల్పూరి లచ్చయ్య, శేరే శ్రవణ్, సుధగోని శ్రీనివాస్, గంధం రవి, సీనియర్ నాయకులు ఆల్లే వెంకటేష్, కోడి గంగయ్య, ఇప్పల రాజ్ కుమార్, గాజుల వెంకటేష్, ముక్తి చందు, దేవి నరేష్, నలువాల అరవింద్, మెరుగు జంపయ్య, ముక్తి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# సీఐటీయూ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి



**నేటి సాక్షి ,పెద్దకడబూరు :** సీఐటీయూ (CITU) 17వ రాష్ట్ర మహాసభలు ఈనెల 17, 18, 19 తేదీల్లో నంద్యాలలో జరగనున్న నేపథ్యంలో, పెద్దకడబూరు మండల కేంద్రంలో సోమవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. నంద్యాలలో జరిగే ఈ మహాసభలకు మండలం నుండి కార్మికులు, నాయకులు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గత మూడేళ్లుగా కార్మిక హక్కుల కోసం నిర్వహించిన పోరాటాలను ఈ సభల్లో సమీక్షించనున్నట్లు, భవిష్యత్తులో సమస్యల పరిష్కారం కోసం మరిన్ని పోరాటాలకు సీఐటీయూ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సీఐటీయూ మండల కార్యదర్శి యు ఈరన్న, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఈ తిక్కన్న, మండల కార్యదర్శి యు శ్రీనివాసులు, అంగన్వాడి టీచర్లు, ఆశా వర్కర్లు, ఆటో డ్రైవర్లు, హమాలీలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 'అరైవ్-అలైవ్'

## రోడ్డు భద్రత అవగాహన సదస్సు



**నేటి సాక్షి ,తిరుమలాయపాలెం :** ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండల కేంద్రంలో రోడ్ల భవనాల శాఖ (R.B), ఎన్ హెచ్ ఏఐ ఆధ్వర్యంలో 'మీ భద్రత మా లక్ష్యం' అనే నినాదంతో రోడ్డు భద్రత అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో షేక్ సిలార్ సాహెబ్ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల్లో ఏ ఒక్కరూ ప్రాణాలు కోల్పోకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం 'అరైవ్–అలైవ్' కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. రోడ్డు భద్రత నియమాలపై అవగాహన లోపం వల్లే అధిక సంఖ్యలో ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం, హెల్మెట్ ధరించకపోవడం మరియు డ్రైవింగ్ చేస్తూ సెల్ఫోన్ మాట్లాడటం వంటివి ప్రమాదాలకు ప్రధాన కారణాలని ఆయన పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ వేగ పరిమితిని పాటిస్తూ ట్రాఫిక్ నిబంధనలు అనుసరిస్తే మన ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా రక్షించవచ్చని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ప్రజా సంఘాల నాయకులు, మాజీ సర్పంచ్‌లు మరియు స్థానికులు పాల్గొన్నారు.

# జీవన్ రెడ్డిని కలిసిన బీఆర్ఎస్ నేతలు

## పార్టీలో చేరికపై శుభాకాంక్షలు వెల్లువ



**నేటి సాక్షి, ఎండపల్లి:** మాజీ మంత్రి జీవన్ రెడ్డిని ఎండపల్లి మండలానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు సోమవారం జగిత్యాలలోని ఆయన నివాసంలో ప్రముఖ వైద్యులు డా.గురువారెడ్డితో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీలో చేరనున్న నేపథ్యంలో హర్షం వ్యక్తం చేస్తూ నాయకులు జీవన్ రెడ్డికి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. మీ రాకతో పార్టీకి మరింత బలం చేకూరుతుంది అని నాయకులు పేర్కొన్నారు. అనంతరం జీవన్ రెడ్డి ఉమ్మడి వెల్గటూర్ మండలంతో తనకు ఉన్న అనుబంధాన్ని నాయకులతో పంచుకుని రానున్న రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కలసి పనిచేద్దామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు సింహాచలం జగన్, మాజీ ఎంపీటీసీ గాజుల మల్లేశం, సర్పంచ్ గాదం భాస్కర్, ఉద్యమకారుడు పడిదం వెంకటేష్, నాయకులు ముక్తి చందు, ఇప్పల రాజ్ కుమార్, ఉప్పు రాజయ్య, ఉప్పుమల్ల పరంధం, దేవి నరేష్, మంతెన సతీష్, నలువాల అరవింద్ తదితరులు పాల్గొన్నారు.